క్లుప్తంగా

ప్రారంభమైన మండల మల్లన్న జాతర



పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

నెన్నెల: మండలంలోని జంగాల్‌పేట, కోణంపేట మధ్యలోని అటవీ ప్రాంతంలో ఉన్న పురాతన గుడి చింతల వద్ద మండల మల్లన్న జాతర శుక్రవారం ప్రారంభమైంది. పూజారి శంకర్ ఆధ్వర్యంలో మల్లికార్జున, భ్రమరాంబల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి పూజలు చేశారు. నెన్నెల, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి, కోటపల్లి మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏటా మహాశివరాత్రి పురస్కరించుకొని జాతర నిర్వహిస్తున్నట్లు పూజారి తెలిపారు. శనివారం మల్లన్న నాగవెల్లి, పట్నాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎత్తు బంగారం మొక్కు తీర్చే..



వేలాలలో ఎమ్మెల్యే వివేక్ తులాభారం

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యేగా గడ్డం వివేక్ గెలుపొందితే నిలువెత్తు బెల్లం తులాభారం చెల్లించుకుంటానని చిర్రకుంట మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య మొక్కుకున్నాడు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా జైపూర్ మండలంలోని వేలాల గట్టుమల్లన్నను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే వివేక్ ఎత్తు బెల్లాన్ని తులాభారంగా చెల్లించుకున్నారు. వేలాల మల్లన్న మొక్కు తీర్చుకున్నందుకు కొమురయ్య సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట ఎమ్మెల్యే వివేక్ కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఫీడింగ్ రూమ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న అర్చన రాంలాల్‌గిల్డా

చెన్నూర్: చంటిపిల్లలకు పాలిచ్చే గదులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు ఫీడింగ్ గదిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, వృద్ధాశ్రమ అధ్యక్షుడు సత్తయ్య, సామాజిక సేవకులు ఉమారాణి, రాజబాపు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బెల్లంపల్లి: పట్టణంలో 33/11 కేవీ శివాలయం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిస్కం పట్టణ ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి బస్తీ, మహ్మద్ ఖాశీం బస్తీ, బూడిదగడ్డ, షంషీర్‌నగర్, హన్మాన్ బస్తీ, రాంనగర్, అశోక్‌నగర్, రడగంబాల బస్తీ, నెంబర్ ఇంక్‌లైన్ బస్తీ, బాబుక్యాంపు బస్తీ, ఏఎంసీ ఏరియా, సుభాష్‌నగర్, శాంతిఖని, 65 డీప్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

నెన్నెల: మండలంలోని ఆవుడం, నెన్నెల విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు కారణంగా గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

'ప్రవీణ్‌కుమార్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు'

మందమర్రిరూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంబీ గుణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షురాలు మాయవతి నిర్ణయం మేరకే బహుజన రాజ్యం స్థాపన కోసం ఎన్డీయే కూటమిలో లేని పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని వివరించారు. రాజకీయ అవగాహన లేని కొందరు బీఎస్పీని, ప్రవీణ్‌కుమార్‌ని విమర్శించడం సరికాదని పేర్కొన్నారు.

ఓం నమః శివాయ

ఓం నమః శివాయ, హరహర మహాదేవ, శంభో శంకర అంటూ భక్తుల నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి శివుని దర్శనానికి పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలిరావడంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది.

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- దర్శనానికి పోటెత్తిన భక్తజనం



చెన్నూర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చెన్నూర్: స్థానిక ఉత్తరవాహిని గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయంలో బిల్వార్చన, అభిషేకాలు చేశారు. శివాలయంలో అర్చకులు మహేశ్వర్‌శర్మ, హిమకర్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. శివయ్య దర్శనం అనంతరం కత్తరసాలలో మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించే జాతరకు బయల్దేరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కత్తెరసాల గ్రామంలో మల్లిఖార్జున స్వామి ఆలయంలో శుక్రవారం మల్లిఖార్జునస్వామి, భ్రమరాంబిక దేవి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గర్భ గుడిలో నుంచి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అభిషేక పూజల అనంతరం మేళతాళాలు, వేదమంత్రాల మధ్య వేద పండితులు కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రవి సౌకర్యాలు కల్పించారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంబాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి సమీప ప్రాణహిత నది భక్తులతో కోలాహలంగా మారింది. ఎడ్లబండ్లు, బైక్‌లు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు. అనంతరం విశ్వేశ్వరాలయంలో పూజలు చేశారు. పెద్దపల్లి జెడ్పీ సీఈఓ నరేందర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన వేమనపల్లికి వచ్చారు. ఎడ్లబండిపై ప్రాణహిత నదికి వెళ్లి పుణ్యస్నానం అనంతరం పూజలు చేశారు.

దండేపల్లి: గూడెం, ద్వారక, లక్ష్మీకాంతపూర్, గుడిరేవు గోదావరి నది తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. లక్ష్మీకాంతపూర్ శ్రీమల్లికార్జున స్వామి ఆలయం వద్ద దండేపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు.

తాండూర్: అచ్చలాపూర్‌శివారు అటవీ ప్రాంతంలోని సన్యాసిమఠం వద్ద స్వయంభువుగా వెలిసిన పరమశివున్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో బ్రహ్మశ్రీ ముద్దు అవదూత శర్మ ఆధ్వర్యంలో శ్రీ మహా రుద్రాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆలయాల్లో పూజలు చేశారు.

నస్పూర్: సీతారాంపల్లి వద్ద గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయంలో పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని పలు శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. గోదావరి నది ఒడ్డున కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్సిపల్ చైర్మన్ వేణు పాల్గొన్నారు.

జన్నారం: కలమడుగు, ధర్మారం, బాదంపల్లి, చింతగూడ గోదావరి తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పొనకల్, పైడిపెల్లి శివాలయాల్లో పూజలు చేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల పుష్కర ఘాట్‌తో పాటు గోదావరి నదీ తీర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసింది. మల్లికార్జునస్వామి, గంగమ్మ తల్లి, శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. గుడిపేటలోని గోవింద క్షేత్రంలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కాగా మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎంపీడీవో మధుసూదన్, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, హాజీపూర్ ఎస్సై సురేశ్, గిర్దావర్ మంగ, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, కార్యదర్శి సరితలు గోదావరి తీరప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. గోదావరి తీరాన కొక్కిరాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. హాజీపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

భీమారం: మండలంలోని గ్రామాల ప్రజలు చెన్నూర్‌లోని పవిత్రగోదావరి నదికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఇంట్లో మల్లన్న బోనాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట గోదావరి తీరంలో భక్తులు పుణ్యస్నానాలు అనంతరం శివాలయంలో పూజలు నిర్వహించారు.

భీమిని: భీమిని, కన్నెపెల్లి మండలాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శివకల్యాణం నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంగడిబజార్‌లోని శివాలయంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పూజలు చేశారు.



చెన్నూర్ శివాలయంలో శివపార్వతుల కల్యాణం



చెన్నూర్‌రూరల్: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ దంపతులు



ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు



మంచిర్యాలరూరల్: పూజలు చేస్తున్న భక్తులు



దండేపల్లి: ద్వారకలో దత్తాత్రేయుడి దర్శనానికి భక్తుల క్యూ



వేమనపల్లి: మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



చెన్నూర్: పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



రామకృష్ణాపూర్: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



దండేపల్లి: ద్వారక గోదావరి తీరంలో భక్తులు



తాండూర్: సన్యాసి మఠం వద్ద భక్తుల బారులు



వేమనపల్లి: పూజలు చేస్తున్న జెడ్పీ సీఈఓ



జన్నారం: బాదంపల్లి గోదావరిలో..



నస్పూర్: షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

ఘనంగా మహిళా దినోత్సవం



కుట్టు మిషన్ సర్టిఫికెట్లతో మహిళలు



బెల్లంపల్లి: కేక్ కట్‌చేస్తున్న జ్యోతి, మహిళలు



మంచిర్యాలఅర్బన్: సన్మానిస్తున్న వాకర్‌క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. టెక్నికల్ సూపర్‌వైజర్ బ్లడ్‌బ్యాంక్ నడిపించడంలో మహిళ పాత్ర కందుల మాధవి, తలసేమియా వ్యాధిగ్రస్తులకు సేవలందించడంలో స్టాఫ్ నర్సుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో మహిళా సిబ్బందిని సన్మానించి, బహుమతులు ప్రదానం చేశారు. కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సభ్యులు మహేందర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్, సత్యనారాయణరెడ్డి, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో..

మంచిర్యాల హైటెక్ సిటీ లయన్స్ ఇంటర్నేషనల్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం 45 రోజులు కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఇటీవల తాను చేసిన సేవలకు గాను డాక్టరేట్ పొందిన లయన్ కె.అన్నపూర్ణను సన్మానించారు. అక్షర స్కూల్ ప్రిన్సిపల్ ఎం.మౌనిక, సోషల్ వర్కర్స్ బండి రమ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక గర్మిళ్ల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబాలకు పెద్ద దిక్కై విభిన్న పనులు చేస్తూ (ఆసుపత్రి, చెప్పులు కుడుతూ, ఇళ్లలో పనిచేసే) ఆదర్శంగా నిలుస్తున్న ముగ్గురు మహిళలను సన్మానించారు. సభ్యులు మధుసూదన్, నరేంద్ల శ్రీనివాస్, మల్లేశ్, తిరుపతి, స్వామి పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో మహిళా దినోత్సవాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. జన్నారం, రేండ్లగూడ పంచాయతీల్లో నాయకులు కేక్ కట్ చేశారు. పలువురు మహిళలను సన్మానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, పార్టీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు శుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాణిక్యం, ఫసీఉల్లా, కరుణాకర్, రమేశ్, ఇందయ్య, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సోహెల్ షా, షాదుపాష, పంకజ, నందునాయక్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని భూడిదగడ్డ బస్తీలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ సతీమణి జ్యోతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. బస్తీ మహిళలు పాల్గొన్నారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, స్పేర్‌రోస్ రాష్ట్ర కోకన్వీనర్ బన్న లక్ష్మణ్‌దాస్, గని ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి జీశాన్, ఇంజినీర్ బాబు పాల్గొన్నారు.

వృథాగా నీటితొట్లు

- దాహార్తితో అల్లాడుతున్న పశువులు
- పాట్లుపడుతున్న మూగజీవాలు



నెన్నెలలో నిరుపయోగంగా నీటి తొట్టి



నల్లాల వద్ద దాహం తీర్చుకుంటున్న పశువు

నెన్నెల: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో నీటితొట్లు నిర్మించారు. వేసవిలో పశువులకు నీటి తొట్లను కల్పించాలనే లక్ష్యంతో నిర్మించగా వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. పంచాయతీల ఆధ్వర్యంలో కొనసాగే మోటారు బావుల నుంచి పశువుల నీటితొట్లకు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నోరు తెరిచి అడగలేని పశువులు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చుట్టూ ధ్వంసమై శిథిలావస్థకు చేరాయి. పశువులకు దాహం వేస్తే కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులు, కుంటలే వాటికి దిక్కవుతున్నాయి.

అధికారులు దృష్టిపెట్టాలి

ప్రభుత్వం పశువుల సంరక్షణకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అవి నీరు గారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోని నీరు ఎండకు అడుగంటిపోతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన తొట్లు వృథాగా వదిలేయడంతో పశువుల దాహార్తి తీరక ప్రజల ధనం వృథాగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు.

నీరందక ఇబ్బందులు

గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశువులు, ఇతర జీవాల కాపర్లు నీటితొట్లపై ఆధారపడుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద నీరు అందుబాటులో ఉండదు. ప్రస్తుతం ఎండతీవ్రత పెరుగుతుండటంతో నీటిమట్టం తగ్గుతోంది. పశువులకు నీటితొట్ల ద్వారా నీరందించాలని పాడైపోయిన నీటితొట్లకు మరమ్మతు చేయాలని పెంపకందారులు కోరుతున్నారు.

నీరు నింపాలి



మా గ్రామంలో రెండు నీటి తొట్లు ఉన్నాయి. అవి నిరుపయోగంగా మారాయి. పంచాయతీ అధికారులు వాటిల్లో నీటిని నింపి పశువుల దప్పిక తీర్చాలి. ఎండలు ముదరాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– అబ్బర్ల శ్రీనివాస్, రైతు, నెన్నెల

వినియోగంలోకి తెస్తాం



ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటితొట్లను పరిశీలించి పశువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఎండలు ముదురుతున్న తరుణంలో నిరుపయోగంగా ఉన్న వాటి వద్ద నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తెస్తాం.

– శ్రీనివాస్, ఎంపీవో

జన్నారంలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

జన్నారం: జన్నారం గ్రామ పంచాయతీ జువ్విగూడలో శివశర్మ జ్ఞాపకార్థం మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆరు జట్ల మధ్య పోటీలు జరిగినట్లు నిర్వాహకుడు సాయికిరణ్ తెలిపారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



ద్వారకలో శివపార్వతుల కల్యాణ వేడుకలు

దండేపల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దండేపల్లి మండలంలోని ద్వారక శ్రీదత్తాత్రేయాలయంలో, మేదరిపేటలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయంలో, నర్సాపూర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణం పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. కల్యాణం జరుగుతున్నంత సేపు భక్తులు శివనామ స్మరణ చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో పల్లకిసేవ నిర్వహించారు.

గండదీపాలు వెలిగించి.. పూజలు చేసి



చెన్నూర్: గండ దీపం వద్ద మహిళ, యువతి

దండేపల్లి/చెన్నూర్: మహాశివరాత్రి రోజున శివునికి ఉపవాస దీక్షలు చేసే కొందరు భక్తులు ఇంటి ముందు పొన్ను రోకలిపై గండ దీపం(గండ చిలుక) వెలిగిస్తారు. దాని వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. దండేపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలు, చెన్నూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి ఇళ్ల ముందు గండ దీపాలు వెలిగించారు. దీన్ని వెలిగించడంతో గండాలు తొలగిపోతాయని ప్రజల నమ్మకం.

భక్తులకు పండ్లు పంపిణీ



భక్తులకు పండ్లు అందజేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాకేంద్రంలోని గోదావరినది తీరం వద్ద పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు మున్నూరు కాపు సంఘం సభ్యులు పండ్లు, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

వేమనపల్లి: ప్రాణహిత పుష్కరఘాట్ వద్ద ఎంపీటీసీ సంతోష్‌కుమార్ తండ్రి నారాయణరావు జ్ఞాపకార్థంగా శుక్రవారం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతిఏటా మాదిరిగానే ఈసారి అల్పాహారం అందించినట్లు ఎంపీటీసీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్‌అలీ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.